జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 10-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 243 పేజీలు: 4 వెల : రూ.7



# అంబరాన.. కమ్మ శిగడాం జాతర

*** మహాలక్ష్మికి పూజలు చేసిన బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి * పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం**

**శ్రీకాకుళం/రణస్థలం, ఫిబ్రవరి 9 (వార్త):** కమ్మ సిగడాం మహాలక్ష్మి జాతర చివరి రోజు ఆదివారం అంబరాన్ని అంటింది. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, రజని దంపతులతో కలిసి ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అమ్మవారిని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన తండ్రి నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు మహాలక్ష్మి జాతరకు ఈ ప్రాంత పూర్వీకులు ఆహ్వానించారని, వేర్వేరు కారణాలతో ఆయన రాలేకపోయారన్నారు. తనకు అమ్మవారి అనుగ్రహంతో ఈ జాతరలో పాల్గొనే అదృష్టం కలిగిందన్నారు. ఏపి ప్రజలు అందరి సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు.

## రాజమ్మ ఉత్సవాలకు పోటెత్తిన భక్తజనం

గార:వత్సవలస గ్రామంలోని రాజమ్మ ఉత్సవాలను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. శనివారం రాత్రి అక్కడే జాగరణ చేసిన భక్తులు ఆదివారం ఉదయం ప్రధాన పీఠాలు వద్ద పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.





# భార్యపై హత్యాయత్నం

*** ఇరువురి మధ్య వాగ్వాదం * క్షణికావేశంలో భార్య మెడకు చున్నీ బిగించిన భర్త * స్పృహ కోల్పోయిన భార్య * చనిపోయిందని పోలీసుల వద్ద లొంగిపోయిన నిందితుడు * కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చిన భార్య * పోలీసులకు ఫిర్యాదు**



**పొందూరు, ఫిబ్రవరి 9 (వార్త):** క్షణికావేశంలో భార్యపై హత్యాయత్నం చేసి.. ఆపై పోలీసులకు లొంగిపోయిన ఘటన పొందూరు మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పొందూరు మండలం లైదాం గ్రామానికి చెందిన గొర్లె సాయిప్రసాద్‌కు సంతకవిటి మండలం బలరాంపేటకి చెందిన పావనితో వివాహమైంది. వీరు శ్రీకాకుళంలో నివాసముంటున్నారు. కొద్ది నెలలుగా వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం భార్యాభర్తలిద్దరూ ద్విచక్రవాహనంపై శ్రీముఖలింగం దైవ దర్శనానికి వెళ్లారు. అనంతరం భార్యను కన్నవారి ఇంట్లో దింపేందుకు బలరాంపేటకు ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. తాడివలస పీహెచ్‌సీ సమీపంలో ఉన్న తోట వద్దకు వచ్చేసరికి వీరి మధ్య గొడవ జరిగింది. దీంతో సాయి క్షణికావేశానికి గురై పావని మెడకు చున్నీతో బిగించాడు. ఆమె ఆమె స్పృహ కోల్పోవడంతో చనిపోయిందని భావించి శ్రీకాకుళం ఎస్పీ కార్యాలయంలో పోలీసులకు లొంగిపోయాడు. అయితే స్పృహ కోల్పోయిన పావనికి కొద్దిసేపటికి కోలుకుంది. బలరాంపేట వెళ్లి తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పింది. తల్లిదండ్రులతో కలిసి ఆదివారం పొందూరు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఆమె ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సత్యనారాయణ కేసు చేసి ఆమెను పొందూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. సాయిప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


## అత్యాచార ఘటనపై కేసు నమోదు

**పలాస:** పలాస మండలానికి చెందిన దివ్యాంగ యువతిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. నాన్నమ్మ ఇంటివద్ద ఉంటున్న యువతిపై మేనమామ వరసైన వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారన్నారు. ఇటీవల యువతికి వైద్య పరీక్షలు చేయగా గర్భవతి అని తేలింది. యువతి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. అయితే కొందరు పెద్ద మనుషులు రంగంలోకి దిగి రాజీయత్నం చేసే యత్నం చేసినట్టు గుసగుసలు వినిపించాయి. వారికి కొందరు రాజకీయ నాయకులు, పోలీసులు సైతం సహకారం అందించినట్టు మండంలో జోరుగా ప్రచారం ఉంది.

# రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించుకుందాం

*** రైతులను ఆదుకుంటాం * మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్ * మిల్లర్ల భవనంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 9 (వార్త):** మిల్లర్ల సమస్యలు పరిష్కరించడంతో పాటు జిల్లా లోని రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా శ్రమిద్దామని నూతనంగా ఎన్నికైన రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తు లేవీ లక్ష్యాలను అధిగమిద్దామన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని రైస్ మిల్లర్ల భవన్‌లో నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం చేసింది. ఇది వరకే జిల్లా అధ్యక్షుడుగా ఉన్న బోయిన్ రమేష్ బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవమైంది. ఈ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు కింజరాపు ప్రసాద్ ఆధ్వర్యంలో పాలక మండలి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామిక వేత్త పలాస నియోజకవర్గ టీడీపీ కార్యదర్శి వెంకన్న చౌదరితో పాటు పలువురు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్ల ప్రతినిధులు అంధవరపు రమేష్, దాసునాయుడు, రమేష్ , తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## ఇందిరా గాంధీ విగ్రహం పునః ప్రతిష్టకు కృషి చేయండి

**పలాస, ఫిబ్రవరి 9(వార్త):** మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ విగ్రహం పునఃప్రతిష్టకు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నగర పంచాయతీ కాలంలో ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, దీంతో ఆ ప్రాంతానికి ఇందిరాగాంధీ చౌక్ అని ఆ ప్రాంతాన్ని పేరు పెట్టే వారిని చెప్పారు. గతంలో ఆ ప్రాంతానికి ఎంత పేరు ఉండేదని, అలాంటిది ఇందిరాగాంధీ బొమ్మ లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తంగుడు వీర్రాజు, రామారావు, కాంగ్రెస్ అభిమానులు ఉన్నారు.



# అవిశ్రాంత యోధుడు.. అచ్చెన్నాయుడు

*** అలుపెరగని ఉపాధ్యాయ ఉద్యమ కెరటం * పరోపకారమే పరమావధిగా సాగిన వ్యక్తిత్వం ఆయన సొంతం * ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ * ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సంతాపసభ**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 9 (వార్త):** అందరివాడు... అవిశ్రాంత యోధుడు... మహామనిషి... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసిన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి దివంగత సువ్వారి అచ్చెన్నాయుడు మాస్టర్ అని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని డీసీసీబీ కాలనీలోని నవయుగ పాఠశాల వెనుకభాగంలో ఉపాధ్యాయ ఉద్యమ సీనియర్ నాయకులు అచ్చెన్నాయుడు మాస్టర్ సంతాప సభను ఎపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సంతాప సభలో ఏపిటిఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షులు ఎం మదన్మోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ గంభీర వదనంతో 96 ఏళ్ల వయో భారంలోనూ కాంతులీనే కళ్లతో అందరినీ పలకరిస్తూ, విద్యార్థులు,ఉపాధ్యాయులు చుట్టూ కలయతిరుగుతూ నిరంతరం వారి ఉన్నతి కోసం ఆలోచించే మహామనీషి అచ్చెన్నాయుడు అని కొనియాడారు. పది మందిని బాధపెట్టి ఎదగడం గొప్పకాదు. పదిమంది బాధను తీర్చి ఎదగడమే గొప్ప అనేది ఆయన సిద్ధాంతమని చెప్పారు. ఒక సామాన్యమైన రైతు కుటుంబంలో పుట్టి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐదు దశాబ్దాల పాటు ఎడతెరిపి లేకుండా ఉద్యమం చేసిన నాయకుడు సువ్వారి అచ్చెన్నాయుడు మాస్టారు అని పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఉపాధ్యాయులకు తనవంతు సహకారం అందించిన అవిశ్రాంత యోధుడని కీర్తించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉన్న సమయంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని, వాటి నుంచి తాను బయటపడడమే కాకుండా తనలా ఎవరూ ఇబ్బందులు పడకూడదన్న బలమైన దృక్పథంతో పనిచేసిన ధీరోదాత్తుడాయన అని తెలిపారు. తుది శ్వాస వరకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మాసపత్రికకు ఎడిటర్‌గా పనిచేసిన అచ్చెన్నాయుడు మాస్టారు ఎందరెందరికో ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని అన్నారు. దిన పత్రికలలో ముఖ్యమైన అంశాలను, కుటుంబ సభ్యుల ఫోటోలు ముఖ్య దినాలను వారికి సంబంధించిన ముఖ్య ఘట్టాలను కట్టింగ్ క్లిప్ లను పుస్తకంలో




అట్టించుకుని నెమరవేసుకునే నాయకుడు ఆయన అని కొనియాడారు. తన చిన్నతనంలోనే యువజన సంఘాన్ని ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధికి కృషిచేసిన ఉద్యమనేత అచ్చన్నాయుడు అని గుర్తు చేసుకున్నారు. సొంత ఊరైన ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామం నుంచి మొట్టమొదటి గ్రాడ్యుయేట్‌గా కీర్తిపొందారని చెప్పారు. ఆంగ్ల భాషలో అనన్య సామాన్యమైన ప్రతిభ ఉన్న అచ్చెన్నాయుడు మాస్టారు రిటైర్ అయ్యాక తుది శ్వాస వరకు శ్రీకాకుళం డీసీసీబీ కాలనీలోని కుమారుడు చలపతితో కలిసి ఉంటున్నారనీ, చలపతికి ఇద్దరు కుమారులు, పెద్దబ్బాయి లేఖజ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా చిన్నబ్బాయి ధీరజ్ ఎంబీబీఎస్ విద్య ను అభ్యసించడం అభినందనీయమని తెలిపారు. ఈ సంతాప సభలో ఏపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె భానుమూర్తి మట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఉపాధ్యాయ లోకం మర్చిపోలేని నాయకులు సువ్వారి అచ్చెన్నాయుడు అని అన్నారు. ఏపీ టీ ఎఫ్ మాస పత్రికలో సందేహాలు – సమాధానాలు శీర్షిక కోసం ఎందరో ఉపాద్యాయులు ఎదురు చూసే వారని అన్నారు. వీటి ద్వారా జీవోల మాష్టర్ గా పేరు పొందారనీ కొనియాడారు. పనిచేసే ప్రతి చోట విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దారన్నారు. శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షులు ఎం మదన్మోహన్, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎస్ కె జిలాని, ఆంధ్ర ప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎస్ ఝాన్సీ, పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి పాండురంగ వరప్రసాదరావు, ఏపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి వెంకటపతి రాజు, ఏపిటిఎఫ్ సీనియర్ నాయకులు వైయస్ ప్రకాశం, ఏపిటిఎఫ్ శ్రీకాకుళం పూర్వ జిల్లా అధ్యక్షులు గణపతిరావు నాయుడు, ఏపీటీఎఫ్ శ్రీకాకుళం పూర్వ అధ్యక్షులు సిహెచ్ అచ్యుతరావు, ఏపిటిఎఫ్ శ్రీకాకుళం పూర్వ ప్రధాన కార్యదర్శి పి మహేశ్వరరావు, ఏపిటిఎఫ్ శ్రీకాకుళం పూర్వ ప్రధాన కార్యదర్శి బి సుభాష్ బాబు, ఏపిటిఎఫ్ శ్రీకాకుళం ప్రధాన కార్యదర్శి ఎస్ వి అనిల్ కుమార్, నగర కార్యదర్శి సదాశివుని శంకరరావు మాష్టర్, సీనియర్ జర్నలిస్ట్ బిర్లంగి రామమోహనరావు తదితరులు మాట్లాడుతూ అచ్చెన్నాయుడు మాష్టర్ గొప్పతనాన్ని, ఉద్యమ నేపథ్యాన్ని, నాయకత్వ లక్షణాలను, వారితో కలిసి పని చేసిన అనుభవాలను వివరించారు. అచ్చెన్నాయుడు మాస్టర్ విగ్రహాన్ని ఏపీ టీ ఎఫ్ జిల్లా కార్యాలయంలో, డిసిసిబి కాలనీ లో పెట్టడానికి సభ తీర్మానం చేసి ఆమోదించింది. కుటుంభ సభ్యులు అచ్చెన్నాయుడు భార్య జోగమ్మ, ఎస్వీ చలపతి, సునీత దంపతులు, చౌదరి బాబ్జి,చల్లాన్నాయుడు,డాక్టర్ వెంకట నారాయణరావు, రాజులమ్మ, అరుణ కుమారి, రాజేశ్వరమ్మ,జోగారావు, ఇందిరావతి, బి వి నరసింగరావు,లలితకుమారి, పి.లోకనాథం, సుజాత, టి దనుం జయరావు, పి.బాలకృష్ణ, టి.అనిల్, లేఖజ్, డాక్టరు బిందు మాధవి,ధీరజ్,సిరి శ్రీనివాస్ , చందరరావు, గోవింద తదితరులు పాల్గొన్నారు.



## భాగెమ్మపేటలో మరిశర్లకు ఘన సన్మానం

**వంగర, ఫిబ్రవరి9 (వార్త):** బాగెమ్మ పేటలో గ్రామంలో భీష్మశుద్ధ ఏకాదశి సందర్భంగా సీనియర్ పాత్రికేయులు, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు మరిశర్ల గంగారావు విజయలక్ష్మి దంపతులను ఆ గ్రామ సామాజిక అభివృద్ధి సంఘం పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా, మెమెంటో సన్మానించారు. అంతే కాకుండా సన్మాన పత్రాన్ని కూడా అందజేశారు. సామాజిక అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ సంఘ ప్రధాన కార్యదర్శి ఏగిరెడ్డి శివరాం నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు, ప్రముఖ న్యాయ వాదులు రెడ్డి విజయ్ కుమార్, రెడ్డి రామమూర్తి , బూరి దామోదర్ రావు ,రిటైర్డ్ జడ్జి గంట వల్లభనాయుడు తదితరులు మాటాడుతూ, మరిశర్ల గంగారావు, వారి కుటుంబం రాజకీయంగా, సామాజికంగా చేసిన సేవలను కొనియాడారు. ప్రధానంగా వారి తండ్రి మరిశర్ల తవిటి నాయుడు భాగెమ్మ పేట, పటువర్ధనం గ్రామాలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను కొనియాడారు. ఈ రెండు గ్రామాలను కలిపే రోడ్డును అలాగే పటువర్ధనం గ్రామంలోనూ, బాగెమ్మపేటలోనూ పురాణ పఠనం చేస్తూ గ్రామస్తులతో ఎంతో బంధుత్వంగా, మైత్రితో మెలిగే వారని గుర్తు చేసుకున్నారు. వారి ఆశయాలను వారి కుమారులు గంగా రావు కూడా కొనసాగించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి మోహన్రావు, రెడ్డి సీతన్నాయుడు, రెడ్డి ఉమా మహేశ్వరరావు, గంట గణపతి రావు, గంట సింహాచలం, రెడ్డి రామలింగేశ్వర రావు, యోగి, రెడ్డి వెంకట నాయుడు, ద్వారపురెడ్డి. కృష్ణ రెడ్డి సత్యం నాయుడు, రెడ్డి వెంకట కళ్యాణి, గంట జయలక్ష్మి ,గంట నాగేశ్వరరావు గంట తిరుపతిరావు రెడ్డి నరసన్నాయుడు, రెడ్డి రాధాకృష్ణ, గ్రామానికి చెందిన యువత, పాల్గొన్నారు. ఈ సభలో కరణం శంకర్రావు చేసిన వ్యాఖ్యానం, ఆలపించిన పద్య, గద్య, రాగాలు అలరించాయి.

## 17 గంటల విష్ణు సహస్రనామ స్తోత్రం



**మందస, ఫిబ్రవరి 9(వార్త):** మందస పట్టణంలోని శ్రీవాసుదేవుని సన్నిధిలో 17గంటల పాటు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం జరిగింది. భీష్మ ఏకాదశి వేడుకలు సందర్భంగా ఆండాళ్ల గోష్టి ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం 17 గంటలపాటు కొనసాగగా భక్తి, శ్రద్ధలతో ముగించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవాసుదేవపెరుమాళునికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి బ్రహ్మోత్సవాలకు సమయం దగ్గర పడుతుండడంతో ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆలయం, పరిసరాలను బ్రహ్మోత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు.

## నేడు దుస్తులు, వాటర్ బాటిళ్ల పంపిణీ

**మందస, ఫిబ్రవరి 9(వార్త):** మందస మండలంలోని చిన్న గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఈ నెల 10న విద్యార్థినిలకు దుస్తులు, వాటర్ బాటిళ్లను సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యంలో పంపిణీ జరుగనుంది. ఈ హాస్టల్లో సుమారు 231 మంది విద్యార్థినిలు ఉండగా, వీరిలో కొంత మందికి తల్లి, దండ్రులు లేనట్టు సమితి ప్రతినిథులు గుర్తించారు. వీరందరికీ ఆశ్రమంలో దుస్తులు, వాటర్ బాటిళ్లను అందజేయనున్నట్టు వారు తెలిపారు. అందుబాటులో ఉన్న సభ్యులందరూ తప్పక హాజరు కావాలని వారు కోరారు.

## ఇస్కాన్ ఆధ్వర్యంలో 11న ఆధ్యాత్మిక సభ

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9 (వార్త):** యూరప్ దేశాల నుండి ఇస్కాన్ భక్తులు ఈనెల 11న 30 మంది ఇచ్ఛాపురం వస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి గ్రామదేవత స్వేచ్ఛ వతి అమ్మవారి ఆలయం నుండి సురంగరాజ మైదానం వరకు నగర సంకీర్తన, 6 గంటలకు మైదానంలో బహిరంగ సభ, 6:30 గంటలకు నుండి ధీరసంత గోస్వామి మహరాజ్ ప్రవచనాలు జరుగుతాయి. 8 గంటల నుండి భోజన కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఇస్కాన్ భక్తులు రాక నిమిత్తం కరపత్రాన్ని బెల్లు పడ యజ్ఞ మండపంలో ఆవిష్కరించారు.




# నా జన్మ ధన్యం

*** సొంతూరులో సన్మానంపై కృష్ణమూర్తి మాస్టారు భావోద్వేగం**

**సోంపేట, ఫిబ్రవరి 9 (వార్త):** ఉపాధ్యాయ వృత్తిలో చేరి జిల్లాలో అనేక ప్రాంతాల్లో పనిచేశానని చివరికి మందస మండలం బహాడపల్లి గ్రామంలో గత నెల 31న ఉద్యోగ విరమణ పొందానని ఆ సందర్భంగా అక్కడ గ్రామస్తులు వివిధ శాఖల అధికారులు తనకు ఘనంగా సన్మానించినప్పటికీ నా సొంత గడ్డైన ఎర్రముక్కాం గ్రామంలో గ్రామస్తులతో సన్మానం పొందడం.. నా జన్మ ధన్యమైందని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అంబటి కృష్ణమూర్తి భావోద్వేగానికి గురయ్యారు. ఆదివారం ఎర్రముక్కాంలో ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన అభినందన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని భావోద్వేగానికి గురై అంతలోనే తేరుకుని తన వద్ద చదువుకొని వివిధ స్థాయిల్లో స్థిరపడిన శిష్యులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి సన్మానించడం గురువుగా తనకెంతో ఆనందం కలిగించిందని అన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో ఉన్నంతవరకే ఉపాధ్యాయులు విద్యార్థుల బాగోగులు చూడగలరని, క్రమశిక్షణ నైతిక విలువలు తల్లిదండ్రుల నేర్పాలని, బాల్యంలో పిల్లలకి నేర్పినవే భవిష్యత్తుకు ఉపయోగపడతాయని ఆ దిశగానే తల్లిదండ్రులు ఆలోచన చేయాలని కోరారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడం గురువులుగా గురుతుల బాధ్యత తమకు




ఉన్నప్పుడికీ ఎక్కువ సమయం తల్లి తండ్రులు వద్దే ఉంటారు కనుక వారి కదలికలు మీరే పసిగట్టాలని అన్నారు. ఉద్యోగాలు ఉన్నంత మాత్రాన ఎవరు గొప్పవారు కాలేరని నైతిక విలువలు క్రమశిక్షణ ఉన్నత భావాలు ఉంటేనే సమాజంలో మనిషికి మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. తన వద్ద చదువుకొని వైద్యులుగా ఉపాధ్యాయులుగా ఇంజనీర్లుగా రాణించామని సభలో తన శిష్యులు చెబుతుంటే అంతకన్నా గురువుగా తనకు ఆనందం ఇంకేం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ సంఘాల ప్రముఖులు రావడం సంతోషంగా ఉందన్నారు. తాను ఉపాధ్యాయ వృత్తి నుంచి రిటైర్ అయినా చదువుల నుంచి కాలేదని ఎవరికి ఎటువంటి సలహాలు కావాలన్నా తాను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా అన్నారు.



## గణితంలో ఎర్రముక్కాం విద్యార్థుల ప్రతిభ

**సోంపేట, ఫిబ్రవరి 9 (వార్త):** సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షల్లో ఎర్రముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్వాతి, సాత్విక్ కుందన, రణదీప్‌లు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారని పాఠశాల హెచ్‌ఎం అనంత తెలిపారు. ఆదివారం జరిగిన ఈ పరీక్షల్లో ఈ పాఠశాల నుంచి వెళ్ళిన నలుగురు విద్యార్థులకు గణితంలో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు కె సన్యాసి, సోషల్ టీచర్ నాగభూషణరావులకు ఆయన అభినందించారు. విద్యార్థుల ప్రతిభకు, ఉపాధ్యాయుల కృషికి పాఠశాల కమిటీ చైర్మన్ తోట యాదవరావు అభినందించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మొక్కలు నాటిన ఆలయన్స్ క్లబ్ ప్రతినిధులు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9(వార్త):** స్థానిక రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయుర్వేద, పూల మొక్కలు నాఆరు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి, బత్తుల వెంకటరమణ, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తెలుకల రామారావు, విశ్వహిందూ పరిషత్తు ప్రతినిధి పాకదాసు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ భక్తులకు ఉపయోగకరంగా ఉండడానికి, సేద దీరడానికి, భక్తుల సౌకర్యార్థం మొక్కలు నాటామన్నారు.





## గారలో పల్లకిసేవ

**శ్రీకాకుళం/గార, ఫిబ్రవరి 9 (వార్త):** గార మండలంలోని యాళ్లపేటలో ఆదివారం సత్యసాయి పల్లకి సేవా కార్యక్రమం నిర్వహించారు. మహిళలు కళశాలు పట్టు నామసంకీర్తన చేస్తూ పల్లకి సేవలో పాల్గొన్నారు. శ్రీకాకుళం జోనల్ యూత్ కోఆర్డినేటర్ చరణ్, హర్ష, గార మండలం యూత్ కో ఆర్డినేటర్ లు ఆదినారాయణ, సాయిరాం, పట్నాయక్, శివ, నాయుడు, రామకృష్ణ, రాజు, సూర్యనారాయణ, అప్పలనాయుడు, జనార్ధన, గాయత్రి, సాయిరాం, యాళ్లపేట భజన మండలి కన్వీనర్ దుంగ శ్రీరాములు తో పాటు గోరువానిపేట, శ్రీకూర్మం, సతివాడ, గార, తూలుగు, కొర్ని, అప్పోజిపేట, యాళ్ళపేట భజన మండలి కన్వీనర్‌లు, బాలవికాస్ పిల్లలు పాల్గొన్నారు.

## గిరిజనులకు స్పీకర్ క్షమాపణ చెప్పాలి



**మందస, ఫిబ్రవరి 9(వార్త):** గిరిజనులకు స్పీకర్ క్షమాపణ చెప్పాలని ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. మందసలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆదివాసీల భూములకు రక్షణగా ఉన్న 1/70చట్టాన్ని సవరించాలని, ఆదివాసీలకు, ఆదివాసీ చట్టాలను అవహేళన చేస్తూ స్పీకర్ మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. బహిరంగ ప్రదేశంలో ఆదివాసీలకు అవహేళన చేసి మాట్లాడిన స్పీకర్ క్షమాపణ చెప్పాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలన్నారు. స్పీకర్ వ్యాఖ్యలకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12న నిర్వహించనున్న ఏజెన్సీ బంద్ కు ఆదివాసీ వికాస పరిషత్ సంపూర్ణ మద్దత్తు తెలుపుతుందన్నారు. స్పీకర్ వ్యాఖ్యలకుపై కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఆదివాసీ వికాస పరిషత్ అధ్యక్షుడు సవర జగన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

## భాస్కరరావు కుటుంబానికి సీదిరి పరామర్శ

**మందస, ఫిబ్రవరి 9(వార్త):** మందస మండలంలోని నర్సింగపురం పంచాయతీ దేవపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పినకాన భాస్కరరావు ఆకస్మికంగా మరణించారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు భాస్కరరావు కుటుంబాన్ని పరామర్శించారు. మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపి, భాస్కరరావు ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. పార్టీకి నమ్మకస్తునిగా ఉంటూ.. మంచి సేవలందించారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, సర్పంచ్ గేదెల పద్మనాభం, పినకాన ఉమాశంకర్, బత్తిని హేమేశ్వరరావు, జి.హరికృష్ణ, పినకాన రాజు, తమిరి శోభన్ బాబు, ఆర్.దాసు, మల్ల నిరాకర్, మద్దిల రామారావు, గుంపు జగదీష్, వీరగున్నమ్మపురం సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.



# యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

***గ్రామాల్లో యథావిధిగా రాజకీయ నేతల ఫ్లెక్సీలు *కోడ్ అమల్లోకి వచ్చి వారం రోజులైనా తొలగించని సిబ్బంది *నేరడి గ్రామ సచివాలయం పక్కనే దర్శనం ఇస్తున్న ఫ్లెక్సీలు**

**కొత్తూరు, ఫిబ్రవరి 9 (వార్త):** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి వారం రోజులు దాటినప్పటికీ గ్రామాల్లో రాజకీయ పార్టీలు, నాయకల ఫ్లెక్సీలు యథావిధిగా అక్కడక్కడా దర్శనమిస్తున్నాయి. ఎన్నికల కోడ్‌ను అమలు చేయాల్సిన సిబ్బందికి ఇవేమీ పట్టడంలేదు. నిబంధనల ప్రకారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లో సంబంధిత అధికారులు గ్రామాల్లో రాజకీయ పరమైన ఫ్లెక్సీలను తొలగించాలి. అయితే మండలంలోని కొత్తూరు మేజర్ పంచాయతీ మరియు కొన్ని గ్రామాల్లో ఉన్నతాధికారులు ఫ్లెక్సీలు తొలగించి, విగ్రహాలకు ముసుగులు వేసినప్పటికీ పలు గ్రామాల్లో కింది స్థాయి ఉద్యోగులు మాత్రం ఫ్లెక్సీలు ఇంకా తీయలేదు. కొత్తూరు మండలంలోని నేరడి గ్రామ పంచాయితీ లో పనిచేస్తున్నటువంటి పంచాయతీ సెక్రటరీ కి మరియు వీఆర్వోకి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నట్లు మైమరచి పోయినట్లున్నారు.ఎక్కడో ఉన్నటువంటి ఫ్లెక్సీలు మరిచిపోవచ్చు కానీ గ్రామ సచివాలయం పక్కనే ఉన్నటువంటి టీడీపీ నేతల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయంటే వీరి యొక్క విధులను మైమరిచిపోతు ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారు.





# కుంభమేళా ఆర్టీసీ స్పెషల్ బస్సులకు అనూహ్య స్పందన



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 9 (వార్త):** శ్రీకాకుళం నుండి మహా కుంభమేళాలో పుణ్య స్నానాలకు (ప్రయాగరాజ్) వెళ్లే వారి కోసం ఆర్టీసీ శ్రీకాకుళం 1వ డిపో అధికారులు ఈ నెల 8వ తారీఖున ఏర్పాటు చేసిన స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ విశేష స్పందన మేరకు, ఈనెల 12వ తేదీ నాడు రెండవ కుంభమేళ యాత్రా స్పెషల్ బస్సును ఏర్పాటు చేశారు. అలాగే ఈనెల 16న మరో బస్సు బయలుదేరుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం బస్ స్టేషన్ నుండి రాత్రి 8గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. మొత్తం 7 రోజుల్లో మొదటి రోజు రాత్రి శ్రీకాకుళంలో బయల్దేరి రెండో రోజు ఉదయానికి పూరి చేరుకుంటుంది. పూరీలో జగన్నాథ స్వామి వారి దర్శనం, కోణార్క్, సాయంత్రం భువనేశ్వర్‌లో గల లింగరాజ్ ఆలయం దర్శించుకున్న పిదప నేరుగా మూడవ రోజు సాయంత్రానికి ప్రయాగ్ రాజ్ చేరుకుంటుంది. నాల్గవ రోజు ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించిన పిదప రాత్రి బయలుదేరి ఐదవ రోజు ఉదయానికి వారణాశి చేరుకుంటుంది. కాశీ విశ్వేశ్వరుడిని దర్శించిన పిదప, ఆరవ రోజు ఉదయం వారణాశి నుంచి బయలుదేరి గయ, బుద్ధ గయ క్షేత్రాల దర్శనానంతరం ఏడవ రోజు రాత్రికి శ్రీకాకుళం చేరుకుంటుంది. ఈ సర్వీస్ కు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. ఈ సదావకాశాన్ని శ్రీకాకుళం జిల్లా పరిసర ప్రాంత ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10 కిలోమీటర్లు లోపున 35 మంది ప్రయాణికులు ఒకే చోటు నుంచి బయల్దేరితే బస్సు వారు కోరిన ప్రదేశానికి పంపుతామన్నారు. మనిషి ఒక్కంటికి టికెట్ ధర రూ.9,500లని, యాత్రా సమయంలో యాత్రికులకు మధ్యాహ్నం భోజనం, ఉదయం, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేయబడిందని తెలిపారు. ఇతర ఖర్చులు, వసతి ఖర్చులు యాత్రికులు ఎవరి ఖర్చులు వారే భరించాల్సి ఉంటుందన్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో స్నానమాచరించి, శుద్ధిని, మోక్షాన్ని పొందుటకు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959235609, 9959225610, 9959225611, 7382917289, 7382921647, 7382923311, 7382924758 నెంబర్లను సంప్రదించా లన్నారు.

## కృష్ణమూర్తి మాస్టారు.. మార్గదర్శి!

**సోంపేట, ఫిబ్రవరి9 (వార్త):** ఉపాధ్యాయుడిగా తన జీవితాన్ని ప్రారంభించి ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందిన సమయం వరకు వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన మార్గదర్శి ఒంబటి కృష్ణమూర్తి మాస్టార్ అని పలువురు వక్తలు అభినందించారు. విద్యారంగంలో ఆయన అందించిన సేవలు నిరుపమానమని ప్రశంసించారు. మందస మండలం బహాడపల్లి ప్రధానోపాధ్యాయుడిగా గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందిన అంబటి కృష్ణమూర్తి మాస్టారుకు సోంపేట మండలం ఎర్రముక్కాం ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం గ్రామస్తులు ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ అభినందన సన్మాన సభ జరిగింది. స్థానిక సర్పంచ్ బైపల్లి ఈశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు కృష్ణమూర్తి మాస్టారు వద్ద చదువుకున్న శిష్యులు అంబటి మోహనరావు, తోట ఈశ్వరరావు, సూరాడ చంద్రమోహన్, బైపల్లి హేమరాజు, డాక్టర్ బైపల్లి వల్లభరావు, తదితరులు మాట్లాడుతూ కృష్ణమూర్తి మాస్టారు విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారిని ఆయన ప్రేరణతో తామంతా ఈ స్థాయిలో ఉన్నామన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ సొంత ఊరికి మేలు చేయాలని తపనతో గ్రామాభివృద్ధి కోసం వివిధ శాఖల అధికారులకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి గ్రామ సమస్యలు పరిష్కరించే వారని కీర్తించారు. ఆయన ఇప్పటిదాకా పనిచేసిన పాఠశాలల్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు పొందారని, ఈయన దగ్గర విద్య నేర్చుకున్న చాలామంది వైద్యులు ,ఇంజనీర్లు విద్యావేత్తలుగా పలు రంగాల్లో స్థిరపడ్డారని ఇదంతా ఆయన క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం వల్లనే సాధ్యమైందని అన్నారు .అనంతరం కృష్ణమూర్తి మాస్టారు దంపతులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గెడ్డవూరు, సిరిమామిడి, తోటవూరు, ఎకువూరు గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కార్మికులను నిర్బంధించి పని చేయించటం చట్టరీత్యా నేరం

### అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శైలేష్ కుమార్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 9(వార్త):** కార్మికులను నిర్బంధించి పని చేయించటం చట్ట రీత్యా నేరమని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వై. శైలేష్ కుమార్ అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఎన్జీఓ హెూమ్ వద్ద ర్యాలీ, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మాట్లాడుతూ కార్మికులను నిర్బంధించి పని చేయించకూడదన్నారు. నిర్ణీత పని గంటల తర్వాత కార్మికులు స్వేచ్ఛగా తమకు నచ్చిన చోట జీవించే హక్కుందన్నారు. యజమానికి డబ్బులు కానీ మరి ఏ ఇతర రకాల బకాయి ఉందని కార్మికుల్ని నిర్బంధించి పని చేయించటం నేరమన్నారు. ఈ సందర్భంగా జిల్లాను వెట్టి చాకిరి రహిత జిల్లా తీర్చి దిద్దెందుకు అందరు కలిసి పని చేస్తామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్‌వి శ్రీనివాస రావు, ఎఎల్ఓ2, లైన్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు, ఎఐటియుసి జిల్లా గౌరవ ఆద్యఖులు సి .హెచ్ . గోవింద్, నేచర్ ఎన్జీఓ ప్రతినిధులు శేఖర్, చైతన్య, వివిధ కార్మిక సంఘ ప్రతినిదులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546